సాక్షి
విజయనగరం
సోమవారం । 11 । మార్చి । 2024



బాలికా విద్యకు సోపానం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనల్లోంచి పుట్టినదే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం.

- 8లో



సొంతింటి కల సాకారమైన వేళ

దశాబ్దాలుగా వేచి చూస్తున్న సొంతింటి కల సాకారమైన వేళ..లబ్ధిదారుల్లో ఆనందం పెల్లుబికింది.

- 8లో

నేడు స్పందన కార్యక్రమం రద్దు

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో ఈ నెల 11వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శెట్టిబలిజలకు పెద్దపీట

- రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ సుజాత

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాత, శెట్టిబలిజల అభివృద్ధికి పెద్దపీట వేసారని రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత అన్నారు. మండలంలోని కంటకాపల్లి గ్రామంలో సూర్య భగవాన్ యాత, శెట్టిబలిజ సంఘం నూతన కమిటీ సభ్యులను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిల్లి సుజాత మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో యాతల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి పెద్దపీత వేశారన్నారు. కార్యక్రమంలో యాత కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దమ్ము రమణ, రాష్ట్ర శెట్టి బలిజల సంఘం అధ్యక్షుడు పిల్లి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మదినా అప్పలరమణ, వైస్ సర్పంచ్ బోదల సుధాకర్, సంఘం నాయకులు బోయిన ఈశ్వరరావు, ఎస్.మంగరాజు పాల్గొన్నారు.

పారామెడికల్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వుల జారీ



రెగ్యులర్ అయిన ఉద్యోగులతో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీఓ నెంబర్ 30, 31 యాక్ట్‌కు అనుగుణంగా శనివారం రాత్రి ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి జాబితాలో 100 మంది ఉద్యోగులకు ఆదివారం డీఎంహెచ్‌ఓ భాస్కరరావు రెగ్యులర్ ఉత్తర్వులు అందజేశారు. వీరిలో 70 మంది హెల్త్ అసిస్టెంట్లు, 12 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 10 మంది ఏఎన్ఎంలు, 8 మంది ట్రైబల్ హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ సందర్భంగా పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి వి.వి.ఎస్.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ చిత్తశుద్ధితో అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. సబ్ కమిటీలో కీలక పాత్ర పోషించిన జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణకు, వైద్య శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జాతర సమన్వయ సమావేశం

చీపురుపల్లి: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో సోమవారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాలకు సంబంధించిన సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈఓ జి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అమ్మ వారి దేవస్థానంలో ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై జాతర నిర్వహణ కోసం చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాలు జరగనున్నాయని తెలిపారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ కమిటీ, భక్తులు సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించనున్నట్లు తెలిపారు.

'ఉపాధి'లో నంబర్ 1

ఉన్న ఊరిలోనే వేతనదారులకు ఉపాధి పనులు కల్పించడంలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే నంబరు వన్‌గా నిలిచింది. లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించి వేతనాల చెల్లింపులు కూడా జరిగాయి.



గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో పని చేస్తున్న వేతనదారులు

- రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజయనగరం
- 1.82 కోట్ల పని దినాలు లక్ష్యం
- లక్ష్యానికి మించి పని దినాల కల్పన
- ఇంతవరకు 1.93 కోట్ల పనిదినాల కల్పన
- ఇందుకోసం ప్రభుత్వం వెచ్చించిన నిధులు రూ.531.83 కోట్లు
- రోజులో పనికి వస్తున్న వేతనదారులు 83 వేల మంది

విజయనగరం ఫోర్ట్:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. వేతనదారులకు నిర్దేశించిన లక్ష్యం కంటే అధికంగా పనులు కల్పించారు. దీంతో రాష్ట్రంలోనే నంబరు వన్ స్థానంలో జిల్లా నిలిచింది. వలసల నివారణ కోసం ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఉన్న గ్రామంలోనే ప్రజలకు పని కల్పించాలన్నది పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఆ విధంగానే అధికారులు పని కల్పిస్తున్నారు. సొంత గ్రామంలోనే పని దొరకడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపాధి లభిస్తోంది. ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు.

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,11,286 మంది వేతనదారులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వం కల్పించే పనులకు వెళ్తున్నారు. వేతనదారులకు పనులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వారికి పనులు కల్పించి వలసలను నివారించింది.

లక్ష్యానికి మించి 1.93 కోట్ల పని దినాలు

2023 – 24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు 1.82 కోట్ల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 1.93 కోట్ల పనిదినాలు కల్పించారు. దీంతో విజయనగరం జిల్లా రాష్ట్రంలో ఫస్ట్ వచ్చింది. ఇందుకోసం రూ.531.83 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. సగటున రోజుకు జిల్లాలో ఉపాధి హామీ పనికి 83 వేల మంది హాజరవుతున్నారు. ప్రతి గ్రామంలోను వేతనదారులు అధిక సంఖ్యలో పనులకు వస్తున్నారు. ప్రతి వేతనదారుడికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గరిష్ఠ వేతనం రూ 272 కాగా వేతనదారులకు రూ.240 నుంచి రూ.272 వరకు వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది.

2023 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు కల్పించిన పని దినాల వివరాలు

నెల	పని దినాలు లక్షల్లో
ఏప్రిల్	39.18 లక్షలు
మే	64.21 లక్షలు
జూన్	43.78 లక్షలు
జూలై	6.68 లక్షలు
ఆగస్టు	1.77 లక్షలు
సెప్టెంబర్	1.68 లక్షలు
అక్టోబర్	1.58 లక్షలు
నవంబర్	2.58 లక్షలు
డిసెంబర్	0.79 లక్షలు
జనవరి	6.60 లక్షలు
ఫిబ్రవరి	27.07 లక్షలు

ప్రతి ఏడాదీ పనులు



ప్రతి ఏడాది మాకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ఎటువంటి పనులు లేని సమయంలో పనులు కల్పించడం వల్ల మాకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. పని డబ్బులు కూడా వారం పది రోజుల్లో మా ఖాతాల్లో పడుతున్నాయి. ఈ పనులు లేనప్పుడు పనుల కోసం వెతుకులాడాల్సి వచ్చేది.

– జామి వరలక్ష్మి, వేతనదారు, జామి గ్రామం

ఉన్న ఊరిలోనే పని



మా ఊరిలోనే మాకు పని దొరుకుతుంది. ఉపాధి హామీ పథకం రాక ముందు విశాఖపట్నం పనికి వెళ్లే వారం. ఇప్పుడు మా గ్రామంలోనే పని పెట్టడం వల్ల మా కుటుంబానికి 100 రోజులు పని దొరుకుతుంది. ప్రతి ఏటా 20 వేల నుంచి 25 వేల వరకు ఆదాయం వస్తుంది. దీంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా మా జీవనం సాగిపోతుంది.

– లావేటి గౌరి, కొత్త బగ్గాం, గజపతినగరం మండలం

చాలా ఆనందంగా ఉంది



రాష్ట్ర స్థాయిలో విజయనగరం జిల్లాకు ప్రథమ స్థానం రావడం ఆనందంగా ఉంది. సిబ్బంది, అధికారులు, వేతనదారుల కృషి వల్ల ఇది సాధ్యమైంది. వేతనదారులు కూడా పనికి రావడానికి ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది వేతనదారులకు పని కల్పించడంతో జిల్లా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

ప్రజలను దోచుకోవడమే చంద్రబాబు నైజం



కర్లాం-నిమ్మలవలస బీటీ రోడ్డు నిర్మాణానికి శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో ఎంపీ బెల్లాన తదితరులు

- టీడీపీ ఆలోచనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం
- మేలు జరిగిందనుకుంటేనే వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వండి
- సంక్షేమం, అభివృద్ధిలో దేశ చరిత్రలోనే సీఎం జగన్ ఆదర్శం
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి:

ఎన్నికలు వచ్చేసరికి డబ్బులు ఇచ్చి ప్రజలను కొనుగోలు చేయొచ్చు, డబ్బు ఇస్తే ఓటర్లు తమ ఓటును తాకట్టు పెడతారనే అజెండాతోనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికలకు వస్తాడని అలాంటి నీచమైన బుద్ధితో ఉన్న వారికి ఓటర్లు చెంపపెట్టుతో బుద్ధి చెప్పాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజలను మోసం చేసి దోచుకోవడమే చంద్రబాబు నైజమని ధ్వజమెత్తారు. మండలంలోని కర్లాం, గొల్లలములగాం గ్రామాల్లో ఆదివారం పలు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. డబ్బుతో రాజకీయాలు చేయొచ్చు, డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయొచ్చు అనే దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్న టీడీపీ వైఖరి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. డబ్బుకు ఓట్లు వేసే విధానానికి స్వస్తి పలికి భవిష్యత్ కోసం ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఐదేళ్ల తమ పరిపాలనలో ప్రతీ ఇంటికి సంక్షేమం, ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. ప్రతీ ఇంటికి మేలు జరిగిందంటేనే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి మేలు జరిగిందని నమ్మితేనే ఓటు వేయాలని బహిరంగంగా అడిగే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఒక్క రూపాయిలంచం లేకుండా వేలాది కోట్లు సంక్షేమ పథకాలు రూపంలో లబ్ధిదారులకు అందించారని చెప్పారు. ఐదేళ్ల తమ ప్రభుత్వంలో కర్లాం సచివాలయం పరిధిలో రూ.29 కోట్లు, జి.ములగాం సచివాలయం పరిధిలో రూ.16 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం అందజేసిందన్నారు. ఒక్కో సచివాయలం పరిధిలో దాదాపు 30 నుంచి 40 మంది ఉద్యోగులను ప్రజలకు సేవ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి ప్రస్తుతం ఇక్కడ చదువుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో ప్రపంచంతో పోటీ పడే విధంగా పునాది వేస్తున్నారని చెప్పారు.

దళారీ వ్యవస్థ లేకుండా సుపరిపాలన

రాష్ట్రంలో దళారీ వ్యవస్థ లేకుండా పారదర్శక పరిపాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఉండేవని, వారికి లంచాలు ఇస్తే తప్ప పథకాలు మంజూరయ్యేవి కావన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో ఒక్క రూపాయి లంచం లేకుండా పథకాలు అమలు మాత్రమే కాకుండా పంపిణీ కూడా జరుగుతోందన్నారు. కర్లాం గ్రామంలో అత్యధికంగా ఉన్న పోలినాటి వెలమలు ఓబీసీ రిజర్వేషన్ లేక ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఓబీసీ ధ్రువీకరణ తీసుకొచ్చామని గుర్తు చేశారు. సినిమాలు తీసుకునే రాజకీయ నాయకులను నమ్మవద్దని కోరారు.

కర్లాంను దత్తత తీసుకుని ఏం చేశారు...

2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడున్న ఎమ్మెల్యే కర్లాం గ్రామాన్ని దత్తత తీసుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారని ఆ సమయంలో ఏం అభివృద్ధి జరిగిందో ప్రజలు గుర్తు చేసుకోవాలని మంత్రి బొత్స కోరారు. దత్తత తీసుకుంటే ఆ గ్రామాన్ని సర్వతోముఖాభివృద్ధిగా అభివృద్ధి చేయాలని, మిగిలిన గ్రామాలు దత్తత గ్రామాన్ని చూసి ఈర్ష్య పడే విధంగా ఉండాలన్నారు. కానీ ఇక్కడ దత్తత తీసుకున్న గ్రామంలో ఏమీ జరగలేదు సరికదా దత్తత తీసుకున్న వారు కనపడకుండా పోయారని అన్నారు.

కర్లాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

మండలంలోనే అతి పెద్ద పంచాయతీగా ఉన్న కర్లాం నుంచి ఇంటర్ చదువు కోసం విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, తమ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, గ్రామంలో ఉన్న పీహెచ్‌సీలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటూ రాత్రి సమయాల్లో సైతం వైద్య సేవలు అందేలా చూడాలని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బాణాన శ్రీనివాసరావు కోరాడు. దీనికి స్పందించిన మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం నుంచి కర్లాం గ్రామంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కర్లాం పీహెచ్‌సీలో రాత్రి సమయాల్లో సైతం సిబ్బంది అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలు అందే విధంగా చర్యలు చేపట్టేందుకు డీఎంహెచ్‌ఓకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

రూ.2.95 కోట్లతో బీటీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని కర్లాం గ్రామం నుంచి నిమ్మలవలస గ్రామానికి రూ.2.25 కోట్లు, గొల్లల ములగాం గ్రామం నుంచి గరివిడి మండలంలోని కోనూరు గ్రామానికి రూ.70 లక్షలు హెచ్‌ఐడబ్ల్యూ నిధులతో తారు రోడ్లు నిర్మాణానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా కర్లాం గ్రామం నుంచి మెట్టపల్లి గ్రామానికి రూ.89 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో ఈ రోడ్లు పనులను పూర్తి చేసి ప్రజలకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, కర్లాం, జి.ములగాం సర్పంచ్‌లు బాణాన భాగ్యలక్ష్మి, కరిమజ్జి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు బాణాన రామలక్ష్మి, కరిమజ్జి సత్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, గరివిడి వైస్ ఎంపీపీ గణపతిరాజు వెంకట అప్పలరాజు, బాణాన రమణ, గొర్లె శ్రీరాములు, గొర్లె రమణ, తహశీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీఓ డి.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట



మక్కువ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: విద్యారంగానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.1.45 లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'మనబడి నాడు – నేడు' పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకు దక్కుతుందన్నారు. అమ్మఒడి పథకంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని నమ్మిన సీఎం ఆ దిశగా అడుగులు వేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, హెచ్ఎం హేమలత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన పాసింజర్ రైలు

- విశాఖ – భవానీపట్నం రైలుకు తప్పిన పెను ప్రమాదం
- భయాందోళనకు గురైన ప్రయాణికులు
- పునరుద్ధరణ పనులు ప్రారంభించిన రైల్వే అధికారులు
- ప్రయాణికుల తరలింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



పక్కకు ఒరిగిన రైలు ఇంజన్

కొత్తవలస :

ఆ పాసింజర్ రైలులో ప్రయాణికులు కబుర్లు చెబుతూ హాయిగా ప్రయాణం చేస్తున్నారు. ఇంతలోనే చిమ్మచీకట్లో ఒక్కసారిగా పెద్ద కుదుపు వచ్చి ఒక్కసారిగా రైలు ఆగిపోయింది. ఏమైందో తెలియక ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రైలు నుంచి దిగి స్టేషన్ వైపు పరుగులు తీశారు. రైలు ఇంజన్ పట్టాలు తప్పిందని తెలిసేసరికి స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... రైలు నంబరు 08504 విశాఖపట్నం – భవానీపట్నం ప్రత్యేక పాసింజర్ రైలుకు ఆదివారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన ఈ రైలు కొత్తవలస స్టేషన్‌కు సుమారు రాత్రి 7 గంటలకు చేరుకొంది. అక్కడ నుంచి బయలుదేరిన నాలుగు నిమిషాలకే కొత్తవలస జంక్షన్ సమీపంలోని డౌన్ లైన్ నుంచి మధ్య లైన్‌లోకి రైలు మళ్లే సమయంలో ఇంజన్, మరో బోగి పట్టాలు తప్పి ఓ వైపు ఒరిగిపోయాయి. వెంటనే పైలెట్లు అప్రమత్తమై రైలును ఆపేశారు. ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే డౌన్ లైన్ నుంచి మధ్య లైన్‌కు మళ్లే పాయింట్ వద్ద సుమారు నాలుగు మీటర్ల వరకు ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. రైలు ప్రయాణికులు పాసింజర్ రైలు దిగి కొత్తవలస రైల్వేస్టేషన్‌కు వెళ్లిపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని కారణాలు తెలుసుకున్నారు. రైలు ఇంజిన్, రెండు పెట్టెలను అక్కడ విడిచిపెట్టి మిగిలిన బోగీలను కొత్తవలస రైల్వేస్టేషన్‌కు తరలించారు. ప్రయాణికులను తమ గమ్య స్థానాలకు చేర్చేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

రైళ్ల రాకపోకలకు ఆటంకం

కాగా రాత్రి 7 గంటల నుంచి 8.30 గంటల వరకు రైళ్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఎక్కడ రైళ్లు అక్కడే నిలిచిపోయాయి. 8.30 గంటల నుంచి విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు ట్రైన్లు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. అలాగే విశాఖపట్నం నుంచి విజయనగరం వైపు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది.



పట్టాలు తప్పి ఒక వైపు ఒరిగిపోయిన రైలు బోగి

పునరుద్ధరణ పనులు ప్రారంభం

లైన్ క్లియర్ చేసేందుకు రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులను చేపట్టారు. రాత్రి 11 గంటల సమయానికి రైళ్ల రాకపోకలకు అవకాశం కల్పిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. కాగా పైలెట్ ఎం.హరికృష్ణ, కో పైలెట్ ఎస్.కె.సింగ్, గార్డు వాసుదేవరావులకు రైల్వే ఆరోగ్య సిబ్బంది మెడికల్ పరీక్షలను నిర్వహించారు.

క్లుప్తంగా

కాపు సామాజిక భవన నిర్మాణానికి నిధులు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్

బొబ్బిలి: కాపు సామాజిక భవనం నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు సిద్ధంగా ఉన్నామని, స్థల సేకరణ ఇతర కార్యక్రమాలను సిద్ధం చేసుకోవాలని ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో నియోజకవర్గ కాపు సామాజిక వర్గ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్ మాట్లాడుతూ సభ్యుల కోరిక మేరకు సంఘం భవన నిర్మాణానికి నిధుల కొరత లేదని ఎంపీల్యాడ్స్‌లో కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ కాపు సంఘం భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కాపు సామాజిక సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చ కొనసాగింది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కాపు సామాజిక వర్గ సంఘం నాయకులు రౌతు రామమూర్తి నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వర రావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ మండలాల నుంచి ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన యాగశాల



పూర్తయిన యాగశాల

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శాశ్వత యాగశాల నిర్మాణం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 11న ప్రారంభించేందుకు దేవస్థాన అధికారులు సన్నద్ధమయ్యారు. యాగశాల ప్రారంభానికి సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయంలో శాశ్వత యాగశాల లేకపోవడంతో అర్చకులు నానా అవస్థలు పడేవారు. తాటాకుల కమ్మలతో ఉండే యాగశాల ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం వెంటాడేది. యాగశాలతో పాటు ఆలయంలో ఫ్లోరింగ్, సుందరీకరణ పనులకు ప్రభుత్వం కోటి రూపాయల నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తి చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు చేతుల మీదుగా యాగశాల ప్రారంభం కానుందని ఆలయవర్గాలు తెలిపాయి. శాశ్వత యాగశాల పూర్తి కావడంతో అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

గంట్యాడ: మండలంలోని బురదపాడు గ్రామం బీసీ కాలనీలో గ్రామానికి చెందిన పెంటబోను అర్జున పూరిల్లు అగ్ని ప్రమాదంలో ఆదివారం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సుమారు రూ.80 వేలు విలువ చేసే వస్తు సామగ్రి అగ్నికి ఆహుతైంది. ప్రమాదం జరిగిన వెంటనే వీఆర్వో లావణ్య సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రాథమిక నివేదికను తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డికి అందజేశారు. ఈ నివేదికకు కలెక్టర్‌కు పంపిస్తామని తహసీల్దార్ చెప్పారు.

25 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు, ఎస్సై రవివర్మ, (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: రైళ్లలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం ఆధారంగా కొద్దిరోజులుగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్న జీఆర్‌పీ సిబ్బంది ఆదివారం 25.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరి మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లాకు చెందిన సుమిత్ర బైదైక్, రేఖలను అరకు రైల్వేస్టేషన్ మీదుగా విశాఖ, కొత్తవలస వైపు వస్తున్న రైల్లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 25.4 కిలోల గంజాయిని సీజ్ చేసి, ఇద్దరినీ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తామని జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామ శివారులో పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై జి.లోవరాజు తెలిపారు. వారి నుంచి రూ.29,630లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

కేజీబీవీ విద్యాలయం బాలికా విద్యకు సోపానం

- 2024–25 విద్యా సంవత్సరానికి ఆహ్వానం
- 6వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలు
- ఈనెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



వీరఘట్టం మండలం రేగులపాడు గ్రామంలో ఉన్న కేజీబీవీ

వీరఘట్టం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనల్లోంచి పుట్టినదే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం. నేడు కేజీబీవీలు బాలికా విద్యకు సోపానాలుగా నిలుస్తున్నాయి. ఆడపిల్లల చదువుకు పెద్దపీట వేస్తూ ఆనాడు నెలకొల్పిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికల ఉజ్వల భవిష్యత్‌కు శ్రీకారం చుట్టాయి. ప్రస్తుతం కేజీబీవీలో సీటు సంపాదించడం అంత ఈజీ కాదు. ఈ సీటు కోసం మినిస్టర్లు, ఎమ్మెల్యేలు కూడా సిఫార్సులు చేసే పరిస్థితి వచ్చిందంటే ఇక్కడ సీటుకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే రెసిడెన్షియల్ విద్యను అందిస్తుండడంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కేజీబీవీల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో 2024–25 విద్యా సంవత్సరంలో కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలు చేపట్టేందుకు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటితో పాటు 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లు కూడా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. కేజీబీవీలో చేరేందుకు అనాథలు, బడి బయట చిన్నారులు, బడి మధ్యలో మానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

పార్వతీపురం మన్యం జిల్లాలో వీరఘట్టం, సీతంపేట, భామిని, గరుగుబిల్లి, కురుపాం, జియ్యమ్మవలస, జీఎల్.పురం, పార్వతీపురం, సాలూరు, కొమరాడ, బలిజిపేట, మక్కువ, సీతానగరం, పాచిపెంట మండలాల్లో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ఉన్నాయి. ప్రతి కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 40 సీట్లు చొప్పున జిల్లా వ్యాప్తంగా అన్ని కేజీబీవీల్లో 6వ తరగతిలో 560 మంది బాలికలకు, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 560 సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే 7వ తరగతిలో 16 సీట్లు, 8వ తరగతిలో 21 సీట్లు, 9వ తరగతిలో 10 మిగులు సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 3,153 మంది బాలికలు ఈ ఏడాది విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది టెన్త్‌లో 79 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇలా కేజీబీవీలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ దినదినాభివృద్ధి చెందుతుండడంతో కేజీబీవీల్లో చదివేందుకు ఎక్కువ మంది బాలికలు ఇష్టపడుతుండడంతో సీట్లకు డిమాండ్ పెరిగింది.

చేరేందుకు కావాల్సిన పత్రాలు

కేజీబీవీలో చేరేందుకు బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు బాలికతో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, స్టడీ సర్టిఫికెట్, ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో పాటు ఫోన్ నంబర్ ఉంటే ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు ఆర్టీఈ టోల్‌ఫ్రీ నంబర్ 18004258599 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం



కేజీబీవీల్లో బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుండడంతో సత్ఫలితాలు వస్తున్నాయి.పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన మొదటి ఏడాదే టెన్త్‌లో 79 శాతం ఫలితాలు సాధించాం .అలాగే మహిళా టీచర్ల పర్యవేక్షణలో బాలికలకు రెసిడెన్షియల్ విద్యను అందిస్తుండడంతో కేజీబీవీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో చేరేందుకు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం.బయట నెట్ సెంటర్లలో ఆన్‌లైన్ చేయవచ్చు. లేదా దగ్గరలో ఉన్న కేజీబీవీకి వెళ్లినా దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

– కర్రి రోజారమణి, జీసీడీఓ, పార్వతీపురం మన్యం జిల్లా

'స్విఫ్ట్ చాట్'తో మెరుగైన బోధన



ఐఎఫ్‌పీ బోర్డు ద్వారా 10వ తరగతి విద్యార్థులకు డౌట్స్ నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు

- ఐఎఫ్‌పీ, బైజూస్ ట్యాబ్స్‌తో యాప్ అనుసంధానం

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి విప్లవాత్మక చర్యలకు తెరతీసింది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందజేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయడమే కాకుండా.. వాటిని వినియోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చింది. డిజిటల్ విద్యను మరింత అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా 'స్విఫ్ట్ చాట్'యాప్‌ను ప్రవేశపెట్టింది.ఉపాధ్యాయుల బోధన మరింత మెరుగుపర్చేందుకు ఈ యాప్‌ను ప్రతి ఉపాధ్యాయుడు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశాలిచ్చింది. అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌పై పనిచేసేలా రూపొందించిన యాప్‌ను ప్రతి ఉపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకునే విధంగా ఉన్నత విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనికి సంబంధించిన లింక్‌ను కూడా విద్యాశాఖ ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, హెచ్ఎంల ద్వారా టీచర్లకు చేరవేసింది. లింక్‌తో పాటు ఇన్‌స్టాలేషన్ ఏ విధంగా చేసుకోవాలో తెలియజేసే సమాచారాన్ని పంపించారు. ఇప్పటికే 99 శాతం మంది ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు.

గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్..

ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై ఇప్పటికే గణితం, ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు.ఈ తరగతుల్లో స్విఫ్ట్ యాప్, ఓ ల్యాబ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అసిస్టెంట్ ఫర్ టీచర్స్, చాట్ జీపీటీ వంటి యాప్స్, పలు వెబ్‌సైట్లపై అవగాహన కల్పించారు.

స్విఫ్ట్ చాట్ అంటే..

ఉపాధ్యాయులు బోధన చేసే సమయంలో విద్యార్థికు సబ్జెక్టు పరంగా సమగ్రమైన జ్ఞానాన్ని అందించాల్సి ఉంటుంది.బోధనలో భాగంగా తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగానే స్విఫ్ట్ చాట్‌లో ఎస్ఎంఎస్ చేస్తే క్షణాల్లో సంబంధిత సమాచారం యాప్‌లో ప్రత్యక్షమవుతుంది. ఈ యాప్‌లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తరగతుల వారీగా డిజిటల్ తరగతులు, లైవ్ క్విజ్‌లు, కాంపిటేషన్ జోన్, స్కిల్ కార్నర్‌లు, రికార్డులు పొందుపర్చారు. నచ్చిన అంశాన్ని సేవ్ ఐటమ్స్‌లో స్టోర్ చేసుకునే అవకాశం యాప్‌లో ఉంది. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతులకు గణితం, మూడు నుంచి ఆరవ తరగతి వరకు గణితం, సైన్స్ సబ్జెక్టులపై మాత్రమే డిజిటల్ తరగతులు, క్విజ్‌లు అందుబాటులో ఉన్నాయి.మిగిలిన సబ్జెక్టులపై కూడా భవిష్యత్‌లో డిజిటల్ తరగతులు పొందుపర్చనున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి



స్విఫ్ట్ చాట్ యాప్‌ను ఉపాధ్యాయుల ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని, రిజిస్ట్రేషన్ చేసుకొనే ప్రక్రియ పూర్తికావచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. సాంఘిక సంక్షేమం, గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు మినిమమ్ టైమ్ స్కేల్‌లో పనిచేసే ఉపాధ్యాయులకు త్వరలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశమిస్తాం.

– ప్రేమ్‌కుమార్, డీఈవో, విజయనగరం

యువకుడి ఆత్మహత్య



మృతుడు కిరణ్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: స్థానిక మయూరి కూడలి వద్ద నున్న నాగోజీపేటలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి వన్ టౌన్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మయూరి జంక్షన్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న నాగోజీపేటలో నివాసముంటున్న కె.కిరణ్‌కుమార్ (29) తల్లిదండ్రులు కొన్నాళ్ల కిందట మృతిచెందడంతో అక్క వద్ద ఉంటున్నాడు. అయితే సరైన ఉద్యోగం లేకపోవడంతో డిప్రెషన్‌కి గురయ్యాడు. కొద్దిరోజులుగా ఒంటరిగా గదిలో ఒక్కడే ఉంటూ మనస్తాపం చెందిది, జీవితంపై విరక్తి పొంది శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కిరణ్ ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన కుటుంబసభ్యులు లోపలికి వెళ్లి చూసేసరికి ఉరివేసుకుని మృతిచెంది కనిపించాడు. దీంతో వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నవీన్‌పడాల్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి అక్క, అన్నయ్య ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నవీన్‌పడాల్

అంతర్ వర్సిటీల క్రీడాపోటీలకు సీతం విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: జాతీయస్థాయిలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలకు అథ్లెటిక్స్ క్రీడాంశంలో స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎం.సాయిజశ్వంత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు పదివేల మీటర్ల విభాగంలో అర్హత సాధించాడని తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ ఎస్ఆర్‌టీఎం యూనివర్సిటీలో శని, ఆదివారాల్లో ఐదు రాష్ట్రాల పరిధిలో జరిగిన పోటీలలో ప్రతిభ చూపడంతో ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, సీఎస్ఓ కోరాడ సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురం సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకుని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు స్థానికుల నుంచి సమాచారం రావడంతో వెళ్లి దాడి చేసి ముగ్గురిని పట్టుకుని వారి నుంచి రూ.5,020 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఇద్దరు కోడి పందాల రాయుళ్లు

కొత్తవలస: మండలంలోని రాజుపాత్రునిపాలెం గ్రామం సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాలపై సీఐ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడి పుంజులను, రూ 3వందల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

57 మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం రూరల్: ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 57మద్యం సీసాలను గజపతినగరం మండలంలోని లింగాలవలస కూడలి వద్ద స్వాధీనం చేసుకున్నామని గజపతినగరం ఎస్సై మహేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికుల సమాచారం మేరకు మాటువేసి వాహనదారుడిని పట్టుకున్నట్లు చెప్పారు. వాహనంతో పాటు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదుచేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సైతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీ అదుపు తప్పి బాలుడి మృతి



మృతిచెందిన రాకేష్ (ఫైల్)

జామి: మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదురుగా స్కూటీ అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ బాలుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాద సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన దేవ సన్యాసిరావు, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు రాకేష్ (15) స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కుమరాంలోనే ఆదివారం తన చిన్నాన్న కుమార్తె శుభకార్యం నిమిత్తం వెళ్లి అందరితో ఆనందంగా గడిపాడు. సాయంత్రం స్కూటీ తీసుకుని విజయనగరం రహదారి వైపు వెళ్లాడు. స్థానిక కేజీబీవీ ఎదురుగా వచ్చేసరికి కుక్క అడ్డం రావడంతో బైక్ అదుపు తప్పి కిందకు పడిపోయాడు. ఈ క్రమంలో తలకు బలమైన గాయం అవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై వీరబాబు తెలిపారు. కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామంలో ఈనెల 3న దువ్వ పోలయ్య ఇంట్లో ప్రమాదవశాత్తు పొయ్యి మీద మరుగుతున్న వేడి నీళ్లు తన కూమార్తె కావ్య (11)పై పడడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైంది. ఈ క్రమంలో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వివాహిత

పాలకొండ రూరల్: పట్టణంలోని లుంబూరువారి వీధికి చెందిన దుప్పాడ కుమారి(28) రోడ్డు ప్రమాదంలో మరణించింది. వివరాలిలా ఉన్నాయి. కుటుంబ పోషణలో భాగంగా భర్త సింహాంద్రికి తోడుగా నిలిచేందుకు తాను కూడా కష్టపడాలని నిర్ణయించుకున్న కుమారి మండలంలోని పణుకువలస సమీపంలో గల ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. రోజులాగానే సహచరులతో కలిసి పనులకు ఆదివారం పయనమైంది. తనతోపాటు పని చేస్తున్న శ్రీరామూర్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రాజుపేట కానా వద్ద రోడ్డుపై ముంగిస అడ్డుగా రావడంతో బైక్ సడన్ బ్రేక్ వేయగా వాహనం అదుపుతప్పింది. దీంతో వాహనం వెనుక కూర్చున్న కుమారి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆమె గుండె, తల బలంగా రోడ్డును తాకడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. వెనుక ఆటోలో వస్తున్న సహచరులు ప్రమాదాన్ని గమనించి తక్షణమే తమ ఆటోలో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీరామూర్తి స్వల్పగాయాలతో బయటపడగా కుమారి పరిస్థితి విషమించడంతో వైద్యులు శ్రీకాకుళం రిఫర్ చేసారు. అక్కడ చికిత్స పొందుతూ కుమారి మృతిచెందింది. కుమారి మరణించడంతో భర్త, ఇద్దరు కుమార్తెలు గుండెలవిసేలా రోదించారు.



కుమారి (ఫైల్)

సొంతింటి కల సాకారమైన వేళ

- సకల సదుపాయాలతో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పంపిణీ
- 672 మందికి తాళాలు, హక్కు పత్రాల అందజేత
- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



సోనియానగర్‌లో నిర్మించిన మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: దశాబ్దాలుగా వేచి చూస్తున్న సొంతింటి కల సాకారమైన వేళ..లబ్ధిదారుల్లో ఆనందం పెల్లుబికింది. గత ప్రభుత్వ హయాంలో మొండి గోడలతో భవనాలు నిర్మించి ఎన్నికల తరుణంలో లబ్ధిదారులకు అప్పగించేందుకు ప్రయత్నించగా..అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంచి ఆలోచనలతో అవసరమైన తాగునీరు, విద్యుత్, రోడ్ల సదుపాయం కల్పించి అప్పటి జాబితా ప్రకారం లబ్ధిదారులకు ఇళ్ల తాళాలతో పాటు హక్కు పత్రాలను అందజేస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం విజయనగరం శివారులో గల సోనియానగర్‌లో నిర్మించిన ఏపీ టిడ్కో కాలనీలో 672 మంది లబ్ధిదారులకు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వి.విజయలక్ష్మి, కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడులు ఇంటి తాళాలతో పాటు హక్కుపత్రాలు అందజేశారు. అంతకుముందు కాలనీలో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. సకల సదుపాయాలతో లబ్ధిదారులకు ఇంటి తాళాలు, హక్కు పత్రాలు అందజేయడంతో హర్షాతిరేకం వ్యక్తమైంది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అన్ని సదుపాయాలతో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందివ్వడం ప్రభుత్వ దార్శనికతకు నిదర్శనమని ఉద్ఘాటించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందివ్వడానికి ఎంతగానో కృషి చేశామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో గోడలు కట్టి అసంపూర్తిగా ఇళ్లను వదిలిపెట్టారని, తాము అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క లబ్ధిదారుడి పేరు తొలగించలేదని, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి నిర్మాణాలను పూర్తి చేసి పూర్తి హక్కులతో అందిస్తున్నామని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఇళ్లను అందించామని పేర్కొన్నారు. జగనన్న కాలనీ ఓ టౌన్ షిప్ మాదిరిగా రూపొందబోతోం దన్నారు. ఎక్కడా రూపాయి లంచం తీసుకోకుండా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నిత్యం ప్రజల చెంతనే

జిల్లా కేంద్రమైన విజయనగరంలో గడిచిన నాలుగు వేసవి కాలాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. 11 వాటర్ ట్యాంకులు నిర్మించి నీటి కష్టాలను తొలగించామని చెప్పారు. ఓట్ల కోసమే ప్రజల వద్దకు వెళ్లడం కాకుండా, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి బ నిత్యం ప్రజల చెంతనే ఉంటున్నామని గుర్తుచేశారు. కరోనా కష్ట కాలంలో ప్రజలకు ధైర్యం చెప్పడానికి రోడ్ల పైకి వచ్చింది కేవలం వైఎస్సార్ సీపీ శ్రేణులేనని మర్చిపోకూడదన్నారు. తమ హయాంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు, పార్కులు, కాలువలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కును నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ చిన్ని తిరుమలరావు, హౌసింగ్ కమిటీ సభ్యులు మారోజు శ్రీనివాసరావు, గాదం మురళి, కార్పొరేటర్లు అల్లు చాణక్య, కనకల నాగవల్లి, పట్టా ఆదిలక్ష్మి, ఇసరపు రేవతి దేవి, మీసాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల తాళాలు, హక్కు పత్రాలు అందుకునేందుకు వచ్చిన విజయనగరంలోని లబ్ధిదారులు